నేటి ప్రజావాణి రద్దు

కలెక్టరేట్, నవంబర్ 17: జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20న జిల్లా పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి రావడం, అలాగే సర్వే కొనసాగుతున్నందున ప్రజావాణిని రద్దు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయానిన గమనించాలని కోరారు.

సమగ్ర సర్వే 72.62శాతం పూర్తి

ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే జిల్లాలో 72.62శాతం పూర్తయిందని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,531ఎన్యుమరేషన్ బ్లాక్‌ల పరిధిలో 1,92,432ఇండ్ల సర్వే చేయాల్సి ఉండగా నవంబర్ 17 నాటికి మొత్తం 1,39,743 ఇండ్ల సర్వే పూర్తి చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 1,154 ఎన్యుమరేషన్ బ్లాక్‌ల పరిధిలో 1,44,972 ఇండ్లకు గానూ ఇప్పటి వరకు 1,02,521 ఇండ్లు, పట్టణాల్లో 377ఎన్యుమరేషన్ బ్లాక్‌ల పరిధిలో 47,460 ఇండ్లకు 37,222 ఇండ్ల సర్వే పూర్తయినట్లు వెల్లడించారు. మిగిలిన ఇండ్లలో సైతం గడువులోగా సర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అవశేషాలు సేంద్రియ ఎరువుగా వినియోగించాలి

కలెక్టరేట్, నవంబర్17: రైతులు పంట అవశేషాలు భూమికి తిరిగి సేంద్రియ ఎరువుగా వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి అజ్జల్ బేగం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరిలో కొయ్యకాళ్లు, పత్తి కట్టెలు కాల్చకుండా వాటిని కుళ్లిన తర్వాత తిరిగి భూమికి సేంద్రియ ఎరువుగా వినియోగించాలన్నారు. అలా కాకుండా పంట అవశేషాలను కాల్చడంతో భూమిలోని తేమ శాతం తగ్గిపోతుందని, ఉపయోగకరమైన అనేక సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. ముఖ్యంగా మట్టి పొరల్లో వుండే పోషకాలు వేడికి ఆవిరికావడం, సేంద్రియ కార్బనం నశించి మన ఆరోగ్యం తీవ్ర ప్రభావం కలుగుతుందని తెలిపారు.

పోలీసుల తనిఖీలు

వేములవాడ, నవంబర్ 17: వేములవాడకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్న సందర్భంగా ఆదివారం పట్టణంలో పలు వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. పట్టణ సీఐ వీరప్రసాద్ మాట్లాడుతూ, ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆదేశాల మేరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వాహనాల తనిఖీ చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

కాల్చొద్దు.. కలియదున్నాలి

- వరికొయ్యకాలు కాలిస్తే నష్టం
- సూక్ష్మపోషకాలకు చేటు, వాతావరణం కాలుష్యం
- నేలలో కలియదున్నితే మేలు
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కోనరావుపేట మండల కేంద్రంలో వరికొయ్యలను కాల్చుతున్న రైతు

కోనరావుపేట, నవంబర్ 17: గతంలో పశువులు ఎక్కువగా ఉండడంతో అన్నదాతలు వరిచేళ్లను కొడవళ్లతో మొదళ్లదాకా కోసేవారు. ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. యంత్రాలను విరివిగా ఉపయోగించడంతో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీంతో హార్వెస్టర్ ద్వారా వరికోత పైకి కోయడం ద్వారా కొయ్యకాలు మిగిలిపోతున్నాయి. ఈ క్రమంలో పొలం దున్నే సమయంలో నాగళ్లకు తడుతున్నాయని రైతులు కొయ్యకాలును కాల్చివేస్తున్నారు. కొయ్యకాలును కాల్చొద్దు.. కలియదున్నితేనే మేలు.. అంటూ వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

కాల్చితే అపార నష్టం

రైతులు వరికొయ్యలను కాల్చడం ద్వారా అపార నష్టం వాటిల్లుతుంది. భూసారం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదముంది. మంటల ద్వారా విపరీతమై వేడితో భూమి భూసారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి దిగ్గుబడి తగ్గిపోతుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. పొలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాశులు చనిపోయే ప్రమాదం అధికంగా ఉన్నది. ఒక్కోసారి గాలికి మంటలు అధికంగా వ్యాపించి మనుషుల ప్రాణాలు కోల్పోయిన ఘటనలున్నాయి. వ్యవసాయ సామగ్రి, పనిముట్లు ధ్వంసమైన సందర్భాలు సైతం ఉన్నాయి.

ఇలా చేస్తే అధిక ప్రయోజనాలు

కొయ్యకాలు నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10శాతం పెరిగే అవకాశం ఉన్నది. దుక్కిదున్నే సమయంలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మునిగి పోషకాలుగా మారుతాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. మొక్కలకు 2శాతం నత్రజని(యూరియా) 4శాతం పాస్ఫరస్ అదనంగా అందిస్తుంది. జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మదాతువులు పంటకు మేలు చేకూర్చుతాయి. నీటినిల్వ సామర్థం పెరుగుతుంది.

అవగాహన కల్పిస్తున్నాం

వరికొయ్యలను తగలబెట్టకుండా భూమిని కలియదున్నడం ద్వారా సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. వరికొయ్యకాలుకు నిప్పుపెట్టడం ద్వారా గాలి, నేల కలుషితమవుతుంది. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు మరణిస్తాయి. దున్నేముందు తప్పనిసరిగా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే కొయ్యలు, గడ్డి తొందరగా కుళ్లిపోతాయి. దీంతో ఎరువుగా మారి దిగుబడి కూడా పెరుగుతుంది. రసాయన ఎరువుల వాడకం పూర్తిగా తగ్గించవచ్చు. ప్రతి క్లస్టర్ పరిధిలో వ్యవసాయ విస్తరణాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రైతులు తమ సూచనలు తప్పకుండా పాటిస్తే మేలు జరుగుతుంది.

– సందీప్, ఏవో (కోనరావుపేట)

ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్ష

- జిల్లా వ్యాప్తంగా 25పరీక్షా కేంద్రాలు
- మొదటి పేపర్‌కు 3,254, రెండో పేపర్‌కు 3,268మంది హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు

తెలంగాణచౌక్: ప్రభుత్వ బాలుర పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, నవంబర్ 17: గ్రూప్–3 పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 25పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, పటిష్టమైన బందోబస్తు మధ్య ప్రశాంత వాతావరణంలో మొదటి రోజు రెండు పరీక్షలు పూర్తయినట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలో మొత్తం 7,062 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా.. మొదటి పరీక్షకు 3,808 హాజరుకాగా 3,254మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన రెండో పరీక్షకు 3,794మంది హాజరుకాగా 3,268మంది గైర్హాజరైనట్లు తెలిపారు. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో ఉదయం 9.30గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేయడంతో అభ్యర్థులు వెనుదిరిగారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలతో పాటు పలు పరీక్షా కేంద్రాలను ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

హాజరు శాతం తక్కువే..

వేములవాడ, నవంబర్ 17: వేములవాడ పరిధిలో గ్రూప్–3 పరీక్షకు ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 2,160 మంది అభ్యర్థులకు గానూ ఉదయం పరీక్షకు 913మంది మాత్రమే పరీక్ష రాయగా, 1,247మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సమయంలో 910మంది మాత్రమే హాజరుకాగా, 1250మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల్లో కేవలం 42శాతం మాత్రమే అభ్యర్థుల హాజరు నమోదైంది. కేంద్రాలను ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఏఎస్పీ చంద్రయ్య, ఆర్డీవో రాజేశ్వర్ పరిశీలించారు.

కేకే అజ్ఞానంతో మాట్లాడుతున్నడు

- అవగాహన లోపంతో ఆరోపణలు సరికాదు
- బీఆర్ఎస్ సీనియర్ నేతలు మాట్ల మధు, మెంగని మనోహర్

ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేతలు మాట్ల మధు, మెంగని మనోహర్

సిరిసిల్లటౌన్, నవంబర్17: కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అజ్ఞానంతో మాట్లాడుతున్నాడని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాట్ల మధు, మెంగని మనోహర్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కేకే మహేందర్‌రెడ్డి మరో కొత్త డ్రామాకు తెరలేపాడన్నారు. నేరెళ్ల ఘటనలో బాధితులను కేటీఆర్ పరామర్శించలేదని ఆయన చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. అధికారుల తప్పిదంతో జరిగిన ఘటనకు కేటీఆర్ బాధ్యుడంటూ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వేములవాడ దవాఖానకు వచ్చి బాధితులను పరామర్శించి వారికి అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం ద్వారా అందించారని తెలిపారు. కేకేకు మతిభ్రమించి ఇష్టారీతిన ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. నేరెళ్ల బాధితులను రాజకీయంగా వాడుకుంటున్నాడని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11నెలలు గడిచినప్పటికీ ఇప్పటి వరకు చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఏ సహాయం అందించలేదని స్వయంగా నేరెళ్ల బాధితులే సోషల్ మీడియా వేదికగా మాట్లాడిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నామమాత్రంగా సీఎం రేవంత్‌రెడ్డిని కల్పించి ఎలాంటి సాయంచేయకుండా గాలికి వదిలేశారని వ్యాఖ్యానించారు. నేరెళ్ల బాధితులకు గత ప్రభుత్వం ఏ చేసిందో.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ న్యాయం చేసిందో.. బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఇప్పటికైనా చిల్లరమల్లర మాటలు మానుకోవాలని హితవుపలికారు. లగచర్ల ఘటనలో లంబాడీ సోదరుల భూములు గుంజుకుని వాళ్ల ఉసురు పోసుకుంటున్నారని విమర్శించారు. నేతన్నలకు ఆర్డర్లు ఇవ్వకుండా.. వచ్చిన ఆర్డర్లను నిలిపివేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ప్రజల గొంతుకై ప్రజల కోసం ప్రభుత్వంపై పోరాటం చేస్తున్న కేటీఆర్‌ను విమర్శించడం సరికాదన్నారు. ఏడాది పాలనలోనే కాంగ్రెస్ ఏంటో ప్రజలకు తెలిసిందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు కంచర్ల రవిగౌడ్, సబ్బని హరీశ్, చిలువేరి చిరంజీవి, గుండు ప్రేమ్‌కుమార్, నీరటి బాబు, గొడిసెల ఎల్లయ్య, మహమ్మద్ జహంగీర్ పాల్గొన్నారు.

సర్వే గడువు పొడిగించాలి

గంభీరావుపేట, నవంబర్17: ఎన్యుమరేటర్ల సమస్యల దృష్ట్యా కులగణన సర్వే నమోదు గడువును పొడిగించాలని డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ ఎర్ర సత్యనారాయణ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ సగం దినంలో చేపడుతున్న సర్వేలో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ నెల 21వరకు ఉన్న సర్వే తుది గడువును పొడిగించాలని కోరారు. ఇక్కడ మండల డీటీఎఫ్ సంఘ ప్రధాన కార్యదర్శి శీలాకుమార్ ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 17: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించే చెకుముకి మండల స్థాయి టాలెంట్ పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సిలివేరి సంపత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అదే రోజు పరీక్ష ఫలితాలు ప్రకటిస్తారని తెలిపారు.

ఏనుగును పెంచుకుందాం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

పుస్తకావిష్కరణ

సిరిసిల్ల టౌన్, నవంబర్ 17: ప్రముఖ బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణీప్రసాద్ రచించిన 'ఏనుగును పెంచుకుందాం' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక సృజన్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకావిష్కరణ చేసి మాట్లాడారు. పిల్లల దవాఖానలో వారి మేదస్సుకు దోహదపడే పుస్తకావిష్కరణ చేపట్టడం హర్షణీయమన్నారు. తెలుగు భాష, తెలుగు రచనలకు ప్రాధాన్యత కల్పిస్తూ డాక్టర్ కందేపి రాణీప్రసాద్ చేస్తున్న రచనలు అభినందనీయమని కొనియాడారు. ఐఏపీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్‌రావు మాట్లాడుతూ, తెలుగు భాష ప్రచారంలో సృజన్ పిల్లల దవాఖాన ముందువరుసలో నిలుస్తుందన్నారు. ఇక్కడ బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణీప్రసాద్, నియోనేటాలజిస్ట్ డాక్టర్ స్ప్పిన్క్, డాక్టర్ రవికుమార్, దవాఖాన మేనేజర్ సృజన్, తదితరులు ఉన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి

- ఇందిరమ్మ ఇండ్ల డబ్బులు నిర్వాసిత కుటుంబాలకు అందించాలి
- మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి

వేములవాడ రూరల్, నవంబర్17: ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండి ప్రతి నిర్వాసిత కుటుంబానికి ₹5.04లక్షలివ్వాలని వేములవాడ మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి డిమాండ్ చేశారు. ఆదివారం అనుపురంలో ఆయన మాట్లాడారు. పీసీసీ హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి ముంపు గ్రామాల్లో పర్యటించి ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పుడు కేవలం ఇండ్లు నిర్మించుకొని 4,696మంది నిర్వాసితులకు ఇంటి నిర్మాణానికి ₹5లక్షలు మంజూరు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. పూర్తిస్థాయిలో 10,683 కుటుంబాలకు ₹5.04 లక్షల చొప్పున ఇవ్వాలన్నారు. మిగిలిన సమస్యలనూ పరిష్కరించాలన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ప్రతి కుటుంబానికి ₹5.04 లక్షలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు మాట మారుస్తాన్నారని మండిపడ్డారు. ఈ నెల 20న సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడకు వస్తున్నందన మిడ్‌మానేరు నిర్వాసితులందరికీ ₹5.04లక్షలు ప్రకటించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 11నెలలు గడుస్తున్నా.. ముంపుగ్రామాల పెండింగ్ సమస్యలు ఇంకా అలాగే ఉన్నాయని విమర్శించారు. నిర్వాసితులను పక్కదారి పట్టించేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకమని మండిపడ్డారు. ఇండ్లు నిర్మించుకొని వారికి మాత్రమే ₹5లక్షలు ఇస్తామంటే, ఇప్పటికే నిర్మించుకున్న వారి విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. కాంగ్రెస్ నేతలు చెప్పే విషయాల్లో స్పష్టత లేదని, అసలు జీవోను చదవి మిడ్‌మానేరు నిర్వాసితులకు సమాధానం చెప్పాలన్నారు. మిడ్‌మానేరులో ముంపునకు గురైన 12గ్రామాల్లో 10,683 కుటుంబాలు ₹5.04లక్షలు ఇచ్చేలా వేములవాడ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డితో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

రాజన్నకు కార్తీక శోభ

- వేకువజాము నుంచే క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం

కోడెమొక్కు తీర్చుకుంటున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబర్ 17: వేములవాడ రాజన్న ఆలయానికి కార్తీక శోభ సంతరించుకున్నది. ఆదివారం సెలవుదినం కావడంతో వేకువజాము నుంచే భక్తులతో పోటెత్తింది. భక్తులు పవిత్రస్నానాలు ఆచరించి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని, తామెత్తు బెల్లాన్ని పంచిపెట్టారు. తర్వాత కోడెమొక్కు చెల్లించుకున్నారు. దాదాపు రెండుగంటలపాటు క్యూ నిలబడి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించుకున్నారు. రాజన్నను దాదాపు 35వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు.

కార్మికులకు ఉపాధి కల్పించాలి

కలెక్టరేట్, నవంబర్ 17: సిరిసిల్లలో పవర్‌లూం కార్మికుల ఆత్మహత్యలు నివారించి.. వారికి ఉపాధి కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం సిరిసిల్లలోని అమృతలాల్ శుక్ల కార్మిక భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 19, 20 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మూడో మహా సభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్, రాష్ట్ర నాయకుడు కూరపాటి రమేశ్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. వేములవాడలో ఈ నెల 20న సీఎం మహాసభ సందర్భంగా సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం నుంచి భారీ ర్యాలీ చేపట్టి.. షాదీఖాన వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. బహిరంగ సభకు పవర్లూమ్ కార్మికులు, ఆసాములు, వార్పిన్, వైపని, డబల్ బెడ్రూం ఇల్లు రానివాళ్లు, తదితరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వేములవాడ పర్యటన సందర్భంగా జిల్లాలోని ప్రధాన సమస్యలు పరిష్కరించే విధంగా ప్రకటనలు చేయాలన్నారు. వర్కర్ టూ ఓనర్ పథకాన్ని ప్రకటించాలని, 2023 యారన్ సబ్సిడీ విడుదల చేయాలన్నారు. పవర్‌లూమ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, డబుల్ బెడ్రూం ఇండ్లు రానివారికి ఇందిరమ్మ ఇల్లు ప్రకటించాలని తెలిపారు. మిడ్‌మానేరు ముంపు గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పించి, ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు విడుదల చేయాలన్నారు. ఇక్కడ సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, సూరం పద్మ, సీపీఎం పట్టణ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్, సీపీ ఎం నాయకుడు రమేశ్‌చంద్ర ఉన్నారు.

మాట్లాడుతున్న మూశం రమేశ్

అలరించిన భక్తిసంగీతం

వేములవాడ టౌన్, నవంబర్ 17: రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై ఆదివారం సామూహిక కార్తీక దీపోత్సవాన్ని ఆలయ అధికారులు కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా దీపాలను వెలిగించి దీపోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రేవతి, నమిలకొండ అనిత, సంకీర్తన బృందం చేసిన భక్తిసంగీతం అలరించింది.

నియామకం

వేములవాడ, నవంబర్17: రాష్ట్ర పద్మశాలీ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా వేములవాడ పట్టణం తిప్పాపురంకు చెందిన నాగుల విష్ణుప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజకుమార్ ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విష్ణుప్రసాద్ మాట్లాడుతూ, పద్మశాలీల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తామని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు రాజకుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

గంభీరావుపేట, నవంబర్ 17: గంభీరావుపేట గీతా పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక ఎల్లమ్మ ఆలయంలో నూతన కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. సమీప ప్రత్యర్థి చేరాల యాదగిరిగౌడ్‌పై 32ఓట్ల తేడాతో గడ్డమీది సుమన్‌గౌడ్ సంఘం అధ్యక్షుడిగా విజయం సాధించారు. ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులుగా పాపాగారి యాదగిరిగౌడ్, సింగారపు బాలాగౌడ్, పాపాగారి శ్రీనివాస్‌గౌడ్, రమేశ్ గౌడ్, శంకర్‌గౌడ్ వ్యవహరించారు.

వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 17: గొల్లపల్లిలోని మార్కండేయ ఆలయం వద్ద లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు ఆదివారం ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు చేశారు. 106మందికి పరీక్షలు చేయగా 8మందికి షుగర్, ఆరుగురికి అధిక బీపీ ఉన్నట్లు గుర్తించి ప్రభుత్వ దవాఖానకు పంపించారు. ఇక్కడ క్లబ్ సభ్యులు నాయిని భాస్కర్‌రెడ్డి, పయ్యావుల రామచంద్రం, బోయిని మహదేవ్, పాటి దేవయ్య, పెంజర్ల దేవయ్య, పెంజర్ల రవి, మద్దివేణి లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

వ్యాపారాల్లో నష్టాలపాలై..

- యువకుడి బలవన్మరణం
- గడ్డి మందు తాగి.. చికిత్స పొందుతూ మృతి
- సింగారంలో విషాదం

స్వామి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 17: ఐదేండ్లు పలు రకాల వ్యాపారాలు చేసినా నష్టాలపాలు కావడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సింగారంలో జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగారం గ్రామానికి చెందిన బండి స్వామి గౌడ్(33) ఐదేండ్ల క్రితం మండల కేంద్రంలో డిస్పోజల్ మెటీరియల్ షాప్ పెట్టాడు. కరోనాతో బిజినెస్ దెబ్బతిని ₹2లక్షలు నష్టపోయాడు. అనంతరం థమ్సప్ డీలర్‌షిప్ తీసుకోగా, నిర్వహణ సరిగా లేక అందులోనూ ₹1.5 లక్షలు నష్టపోయాడు. మూడేండ్ల క్రితం ₹2.5లక్షలతో ఓ ప్రైవేట్ డెయిరీని ఏర్పాటు చేసుకుని నడుపుతూ ఉండగా, బిజినెస్ అంతంత మాత్రంగానే ఉంటుండడంతో, షేర్‌మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి ఆదాయం సంపాదిద్దామని అనుకున్నాడు. ₹10లక్షల వరకు అప్పులు చేసి షేర్ మార్కెట్ పెట్టి పోగొట్టుకున్నాడు. అప్పులిచ్చిన వారు వెంటనే చెల్లించాలని అడుగుతుండడంతో తట్టుకోలేని స్వామి ఈ నెల 11న థమ్సప్‌లో గడ్డిమందు కలుపుకుని తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని అశ్వినీ హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్వామికి భార్య శ్వేత, కుమారుడు సాద్విన్, కూతురు వర్షిత ఉన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

వేములవాడ, నవంబర్ 17: పట్టణంలోని మాతృశ్రీ దవాఖానలో ఆదివారం మెడికవర్ కరీంనగర్ దవాఖాన సౌజన్యంతో గుండె సంబంధిత ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ గుండె సంబంధిత వైద్య నిపుణుడు డాక్టర్ పీ అనిశ్ 150మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీఈకో, సూపర్ స్పెషాలిటీ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇక్కడ మాతృశ్రీ దవాఖాన చైర్మన్ డాక్టర్ సీహెచ్ సంతోష్‌కుమార్, గుర్రం కిరణ్, మార్కెటింగ్ హెడ్ కర్ణాకర్, శ్రీకాంత్, లక్ష్మీరాజం ఉన్నారు.

కలెక్టరేట్: మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సీఎం పర్యటన ఏర్పాట్లపై సన్నాహక సమావేశం

కలెక్టరేట్, నవంబర్ 17: ఈ నెల 20న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో ఇబ్బందులు రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటనకు శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రినీరెడ్డితో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేలా చూడాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు వెంకటఉపేందర్‌రెడ్డి, రాజేశ్వర్, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ బాపురెడ్డి, డీఎంహెచ్‌వో డా ఎ వసంతరావు, సీపీవో శ్రీనివాసచారి, మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ

వేములవాడ టౌన్, నవంబర్ 17: ఈ నెల 20న సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఆలయ పరిసరాలను ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం క్షుణ్ణంగా పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో భక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం దర్శనం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులకు పలు సూచనలు చేశారు. ఇక్కడ ఆలయ ఈవో వినోద్‌